# అమ్మతనం

పట్నాల ఈశ్వరరావు

ఆ సాయంకాలం వేళ–

స్కూలునించి వచ్చిన గోపాలం గారు లాల్చీ విప్పి కొక్కానికి తగిలిస్తూ 'పూర్ణా' అని పిలిచిన పిలుపుకి 'వస్తున్నా' అంటూ సమాధానంతోబాటు టీ కప్పుతోనూ ప్రత్యక్షమైంది అర్ధాంగి 'అన్నపూర్ణ'.

'టీ' అందుకుంటూ 'బజారు కెళదాం. తయారవు! అన్నారు గోపాలంగారు.

'నెలాఖర్లో బజారేంటి?' అన్నట్టు ప్రశ్నార్థకంగా కళ్ళెగరేసింది అన్నపూర్ణ.

ఆ కళ్ళంటే ఆయనకు చాలా యిష్టం.

భాషని కనిపెట్టడం వలన మనుషుల మధ్య వుండవలసిన కొన్ని అపురూపమైన, ఆనందకరమైన అనుభూతులు దూరమై పోయాయని గోపాలం గారి అభిప్రాయం. అన్నపూర్ణ సాహచర్యంలో అది నూటికి నూరుపాళ్ళూ నిజమనిపించిందాయనకి

వీళ్ళ ముప్పయ్యేళ్ళ దాంపత్య జీవితంలో ఏకాంతం దొరికింది ఎక్కువగా రాత్రిపూట పడకగదిలోనే. అందుకనే నేత్రావధానం అనివార్యమైన అవసరమైందా దంపతులకు.

పెళ్ళయిన కొత్తలో అత్తవారింటిలో భార్యని రమ్మని సైగ చేస్తే 'ఎందుకు!?' అని కళ్ళెగరేస్తే ఆ చూపుల్లో అతడికి కొంటెతనపు ముగ్ధ శృంగారం కనిపించింది.

ఇవాళ – ప్రొద్దుగుంకబోతున్న ఈ వయస్సులో కూడా 'బజారు కెందుకు?' అని కళ్ళెగరేస్తే– ఆనాటి చిలిపిదనమే గోచరించింది గోపాలంగారికి.

అయితే – ఆనాటివి గోదావరి గలగలలైతే, ఈనాటివి నిండు గోదావరి నిశ్శబ్ద సంగీతరావాలు.

గడచిన మధురస్మృతులు జ్ఞప్తికి రాగా – చిరునవ్వు పెదిమలపై నెలవంకలా మెరిసింది గోపాలం గారికి. ఆయననే ఆశ్చర్యంగా చూస్తోంది అన్నపూర్ణ.

ఏదో విశేషం ఉందనుకొని మరేం అడక్కుండా అలాగేనంటూ తలాడించి లోనికెళ్ళిపోయింది అన్నపూర్ణ.

** ** **

ఏభై రెండేళ్ళ గోపాలం మేష్టారు పురపాలక సంఘ ప్రాథమిక పాఠశాలలో ముప్పై రెండేళ్ళుగా ఉపాధ్యాయుడిగా పనిచెస్తున్నారు. మరీ పొడుగ్గాకాక, పొట్టిగా కాక మధ్యస్థంగా మద్దిచెట్టులా ఉంటారాయన. గుండ్రటి మొహం. దళసరి పెదవులు, వెడల్పాటి ముక్కుమీద వ్రేలాడే చత్వారపు కళ్ళద్దాలతో గోపాలం గారిని చూడగానే ఎవరికైనా ఈయన చేసేది ఉపాధ్యాయ ఉద్యోగమే అయ్యుంటుందని టక్కున చెప్పెయ్యగలరు.

పెరిగిపోతున్న ధరలతో రూపాయివిలువ విలోమానుపాతంలో పహరా హుషార్ అంటుంటే కుటుంబ సభ్యులూ వారి అవసరాలు అనులోమంగా సంచరించేవి.

మూడు మూళ్ళు తొమ్మిది, నాలుగార్లు ఇరవై నాలుగు అని ఎక్కాల్ని బట్టీ పెట్టించకుండా అవి ఎలా అయిందీ, ఎందుకయిందీ విడమరచి చెప్పే బోధనానుభవం ఎందరో విద్యార్థుల హృదయాలలో మంచి ఉపాధ్యాయుడిగా ఆయన స్థానాన్ని పదిలం చేసింది.

కానీ వచ్చిన జీతంతో పెరిగే కుటుంబ ఖర్చులను తట్టుకోవడం లోను, ఆదాయ వ్యయాల సంకలన ప్రక్రియలో తత్సమాంశం సాధించడంలోను ఆయనకు తోడ్పడింది మూడు ముళ్ళువేసి అర్ధాంగిని చేసుకున్న అన్నపూర్ణే.

అయితే ఈ జీవన పోరాటంలో ఆ దంపతులు ఎన్నో విషయాలను నేర్చుకున్నారు. జీవితాన్ని క్రమపద్ధతిలో తీర్చి దిద్దుకోవడంలోను, కోర్కెలకు కళ్ళెం వేయడంలోను ఎంతో నిగ్రహం ప్రదర్శించారు.

ఆ సంయమనమే వాళ్ళ బ్రతుకు బండి సాఫీగా నడవడానికి దోహదం చేసింది.

గోపాలం గారి కిపుడేమీ పెద్దగా బాధించే సమస్యలు లేవు. కొడుకులు ఉద్యోగస్థులయ్యారు. చిన్నాడు ఉద్యోగరీత్యా దూరంగా వుంటే పెద్దవాడు వాళ్ళవద్దే ఉన్నాడు. ఆడ పిల్లలకు పెళ్ళిళ్లు చేశారు. వాళ్ళు సుఖంగానే బ్రతుకుతున్నారు.

ఎపుడూ చిరునవ్వుతో కనిపించే అర్ధాంగి అన్నపూర్ణని తనకు లభించిన అపురూప వరంగా భావిస్తారు గోపాలంగారు.

ఈ ముప్పయేళ్ళ జీవన సాహచర్యంలో ఆమె భర్తనేమీ కోరలేదు. 'కోరికలే దుఃఖానికి మూలమన్న' బుద్ధుడి సూక్తిని బాగా ఒంటబట్టించుకుందా– అనిపిస్తుంది.

అయితే విచిత్రంగా గోపాలం గారిలో ఒక చిన్న కోరిక పుట్టి రోజురోజుకి పెరిగిపోతూ ఆయన ఆలోచన్లని తొలిచేస్తోంది.

దీని ఫలితంగా ఆయన తన ప్రావిడెంట్ ఫండ్‌కి పార్ట్ విత్‌డ్రాయల్ కొరకు దరఖాస్తు చేశారు.

** ** **

ఆటోని పిలుస్తోన్న భర్తవైపు ఆశ్చర్యంగా చూస్తూ, 'జీతం బకాయిలు ఏవైనా అందాయా?' అడిగింది నవ్వుతూ అన్నపూర్ణ.

ఏదైనా బరువైన లగేజీ వుంటే తప్ప ఆటోలు, రిక్షాలు ఎక్కడానికి ఇష్టపడరు గోపాలంగారు.

బుగ్గనున్న 'కారా' రసాన్ని ఉమ్మేస్తూ 'మరేం పర్లేదులే!' అన్నట్టు నవ్వుతూ చూశారు భార్యవైపు.

ఆటోలో కూర్చున్నాక అందిన పి.ఎఫ్ సొమ్ము గురించి, తన కోరిక గురించి వివరించారు గోపాలంగారు. బట్టలషాపు దగ్గర ఆటోదిగారు దంపతులిద్దరూ.

నగరంలోని పెద్దబట్టల దుకాణంలో అది ఒకటి. పట్టుచీరలకు ప్రసిద్ధి గాంచిన ఆ దుకాణం ఎప్పుడూ

కొత్త పట్టుచీరలా రెపరెపలాడుతూ మెరిసిపో తుంటుంది

ఇంత పెద్దషావులో కెందుకండీ? అంటున్న భార్యని కళ్ళతోనే వారించడంతో భర్తని అనుసరించింది అన్నపూర్ణ. లోనికి అడుగెడుతూనే ఎ.సి. చల్లదనం శరీరాన్ని తాకి మైమరపించడంతో మరో లోకంలోకి వచ్చినట్టనిపించింది వాళ్ళకి.

అడుగడుక్కీ విద్యుత్ గొట్టాల తెల్లదనవు కాంతికి తోడు మధ్యమధ్యలో నియోన్‌లైట్ల కాంతి ధగధగలతో మెరిసిపోతోంది వస్త్రలత.

పట్టుచీరల కౌంటరు దగ్గరకు వాళ్ళని తీసికెళ్ళాడు షావులో కుర్రాడు సవినయంగా. కౌంటరు చుట్టూ వున్న మెత్తటి పరువులమీద కూర్చోగానే వాళ్లచుట్టూ ఖరీదైన పట్టుచీరలను ఒకటొకటిగా పేర్చి చూపిస్తున్నాడు సేల్స్‌మెన్

రకరకాల డిజైన్లతో, జరీలతో కళకళలాడుతోన్న చీరల పేర్లను కంచి, ధర్మవరం, ఆరణి అని వాడు గడాగడా వల్లించేస్తోంటే విస్తుబోయి చూస్తోంది అన్నపూర్ణ. ఏ చీర ఖరీదు అయిదువేల రూపాయలకు తక్కువలేదని తెలిసి 'అమ్మయ్యో!' అనుకుంది. ధరలు తెలిసిన తర్వాత వాటిని ముట్టుకోవడానికి కూడా భయమేసిందామెకు. అవి పట్టుచీరల్లా కాక పాము కుబుసాల్లా కనిపించాయి.

'మళ్ళీ వస్తా'మని చెప్పి ఇంకేవీ చూడకుండానే వెళ్ళడానికి లేచింది అన్నపూర్ణ. ఏదో చెప్పబోతున్న భర్తని కళ్ళతోనే వారించి.

చేసేదేంలేక ఆమెననుసరించారు గోపాలంగారు.

'ఇవుదెందుకండీ! అంత ఖరీదైన చీరలు'– షావునుంచి బయటకు రాగానే నిలదీసింది భర్తని.

'పట్టుచీరలు కట్టుకోబోతే నన్నెవరూ పేరంటానికి పలవరా?' – చురుగ్గా చూసింది భర్తవైపు.

'ఇవుడే చీరలూ వద్దు. ఇంటికి పోదాం పదండి!' అంది భర్త నుద్దేశించి అన్నపూర్ణ.

ఇన్నేళ్ళ తన సంపాదనలో కుటుంబావసరాలకే తప్ప, తమ స్వంతానికీ, సరదాలకీ ఖర్చుపెట్టుకున్నది లేదనీ, కనీసం ఇప్పడైనా తన కష్టసుఖాలను పంచుకున్న సహధర్మచారిణితో ఆనందానుభూతుల్ని పంచుకోవడానికి కొద్దిపాటి సొమ్ము ఖర్చు పెట్టుకోవడంలో అసమంజసమూ, అత్యాశా లేవనీ, ఇలాంటివెన్నో చెప్పాలనుకునీ– ఏ వాక్యమూ గొంతులోంచి బైటకు రాక 'అది కాదే పూర్ణా!' అన్నారు గోపాలంగారు.

'ఎందుకండీ మీకీ తాపత్రయం? వేల రూపాయలు పోసి నాకొక్కర్తికే ఒక్క చీర కొనే బదులు పెద్ద పండక్కి పిల్లలందర్నీ పిలిచి బట్టలు పెడితే అందరూ సంతోషిస్తారు గదా!'– చిన్నగా నవ్వుతూ అంది అన్నపూర్ణ.

అమ్మమనసు అంతేనేమో!

ఎక్కడో కొండల నడుమ చిన్న పాయగా




**స్త్రీ, యవ్వనవు తొలినాళ్లలో ఉండే స్వార్థమూ, తపన, గర్వం, మమకారం, వయస్సు పెరిగే కొద్దీ ఒకటొకటిగా వదిలేసుకుంటూ చివరకు 'తన' అన్న భావన నుంచి 'మన'కు చేరుతుంది.**

పుట్టిన గోదావరి ఇరుకుదారుల వెంబడి పయనిస్తూ, కొండల్నీ, కోనల్నీ చుట్టుకుంటూ, అంతటా తానై వుండాలని, అన్నీ తనకే చెందాలనే తపనతో ధృతంగా ప్రవహిస్తూ, చివరకు విశాలమై, నిండు గోదావరియై, భద్రాద్రి రాముని పాదాలవద్ద పునీతమవుతుంది.

స్త్రీ కూడా అంతే! యవ్వనవు తొలినాళ్లలో వుండే స్వార్థమూ, తపన, గర్వము, మమకారం. వయస్సు పెరిగే కొద్దీ ఒకటొకటిగా వదిలేసుకుంటూ చివరకు 'తన' అన్న భావన నుంచి 'మన'కు చేరుతుంది.

మౌనంగా నడుస్తోన్న భర్తను చూసి తన మాటలకు నొచ్చుకున్నారేమో ననిపించింది అన్నపూర్ణకు.

'ఓ పనిచేద్దాం. మన మిద్దరమూ బట్టలు తీసుకొందాం!' అనునయంగా అంది.

అతడి మౌనాన్ని అంగీకారంగా తీసుకొని తమ ఖాతా బట్టల దుకాణానికి వెళ్ళి ఇద్దరికీ బట్టలు తీసింది అన్నపూర్ణ.

'ఇక సంతోషమేనా అయ్యవారికి'! -నవ్వుతూ అడిగింది అన్నపూర్ణ.

'లేదు. ఇంకోటుంది'- అన్నారు గోపాలంగారు.

'ఇంకేవిటీ?' - అన్నట్టు చూపుల తూపుల్తో చురుక్కు మనిపించింది అన్నపూర్ణ.

ఈసారి నామాట వినాలి. కాదూ, కూడదూ అనకూడదు - అంటూనే బంగారం షాపులోకి దారితీశారు గోపాలంగారు.

'ఏంటండీ ఈ చోద్యం!?'- విస్తుపోతూ అడిగింది అన్నపూర్ణ.

'బట్టల మీదైతే వృధాఖర్చు అన్నావు. బంగారం మీద కాదుగా! నా మాట విను. పెద్దబ్బాయి ఉద్యోగం కోసం డబ్బు కావాలంటే గాజులు తీసి ఇచ్చేశావు. ఇప్పటివరకు చేయించలేకపోయాను. ఇపుడు మన దగ్గర డబ్బుంది గాజులు కొనుక్కో' అన్నారు గోపాలం గారు ఎంతో ప్రేమగా భార్య కళ్ళలోకి చూస్తూ.

భర్త అనురాగానికీ, ఆప్యాయతకు ఆమె మనస్సు ఆర్ద్రమయింది. అనిర్వచనీయమైన ఆనందపు అనుభూతుల్తో, భర్త పట్ల కృతజ్ఞతతో ఆమె హృదయం ఆనందడోలికే అయింది. 'భగవంతుడా! ఈ జీవితాన్ని ఇలాంటి సంతృప్తితోనే సాగిపోనీ!' అని మనసారా కోరుకుంది అన్నపూర్ణ.

ఆనందం నిండిన కళ్ళతో భర్తవైపు అనురాగంగా చూసింది. కానీ, గాజులు కొనుక్కోవడానికి మనసొప్పలేదు అన్నపూర్ణకు. భర్త మనసు నొప్పించడం ఇష్టంలేక చిన్న దుద్దులు మాత్రమే కొనుక్కుంది.

** ** **

తనమాట వినలేదన్న చికాకుతో కనీసం తనకు నచ్చినట్టు, కోరుకున్నట్టు ఒక్కరోజైనా గడపలేకపోయానన్న అసహనంతో అటుతిరిగి పడుకున్న గోపాలం గార్ని చూసి నవ్వొచ్చింది అన్నపూర్ణకు.

'నామీద కోపమే!' -చిన్నగా నవ్వుతూ మురిపెంగా అంది అన్నపూర్ణ- మంచంమీద కూర్చుంటూ.

'కోపంలో కూడా అయ్యవారు అందంగానే వున్నారుగానీ ఓ మాట చెప్తాను కాస్త నావైపు తిరగండి' అంటూ భర్తని తనవైపు త్రిప్పకుంది.

ఇంట్లో పెద్ద కోడలుంది. కోడలైనా కూతుర్లా మనలో కలిసిపోయింది. పెళ్ళినాడు ఏం పెట్టామో! అంతే. ఆ తరువాత మనంగాని, అబ్బాయిగాని అణాయెత్తు వస్తువు కూడా చేయించలేకపోయాం. ఇవాళ నేను కొత్తగాజులు వేసుకు తిరుగుతుంటే దాని మనస్సు చివుక్కుమనదూ!

పెద్ద పిల్లకి పెట్టినంత కూడా మనం చిన్నదానికి పెట్టలేకపోయాం. అల్లుడు మంచివాడు. మన స్థితిగతులు తెలిసినవాడు. గనుక ఊరుకున్నాడు. అడగలేదు గదా అని మనవూ ఊరుకుంటే బాగుంటుందా!?

రేపు పెద్ద పండక్కి వాళ్ళని పిలిచి ఈ డబ్బేదో వాళ్ళకిస్తే పిల్లా సంతోషిస్తుంది. మనకీ తృప్తిగా వుంటుంది'.


భర్త ప్రక్కనే పడుకుని తన మనోగతాన్ని మెల్ల మెల్లగా వివరించింది అన్నపూర్ణ అనునయంగా.

భార్య ఆలోచనా పరిధికి, ముందు చూపుకీ ఆశ్చర్యపోయారు. తన పట్టుదల, పంతం ఎంత అవివేకమైనవో అర్ధమయ్యేసరికి తనలో తానే సిగ్గుపడిపోయారు.

ఎంత వయస్సు వచ్చినా, ఎన్ని చదువులు చదివినా మగాడెపుడూ స్వార్ధపరుడే!

త్రిమూర్తులైనా అనసూయ దగ్గర చంటిపాపలైనట్లు, అమ్మతనం ముందు అందరూ అల్పులే అనిపించింది గోపాలం గారికి.

అంతులేని అనురాగంతో భార్యను అక్కున చేర్చుకున్నారు గోపాలంగారు. అతడి కౌగిలిలో గువ్వలా ఒదిగిపోయింది అన్నపూర్ణ అమాయకంగా.






## సీతాదేవి విగ్రహం

మావూరి ప్రక్క గ్రామములో శ్రీమాన్ శ్రీనివాసాచారి గారని ఒక వైష్ణవ మిత్రుడు వుండేవాడు. ఆయన తమ్ముడు వరదాచారి గారని మంచి పేరుగల హార్మనిస్టు.

ఒకసారి 'సీతారామ లక్ష్మణుల విగ్రహాలు ఎలా వుండాలి? అని చర్చించాము. అయితే శ్రీనివాసాచారిగారు విష్ణుపట స్వభావంతో ఇలా చెప్పారు. 'సీతాదేవి చూపు శ్రీరామస్వామి తిరువడిగళ్ళు (పాదాల)పై వుండునట్లుగా విగ్రహం సిద్ధం చేస్తే మంచిది. అని చెప్పారు. అయితే విగ్రహాల తయారీలో అంతటి మెలకువ ప్రావీణ్యం వున్న కరామఇక కళాకారులివ్వదున్నారా? అని సందేహం. పై చెప్పబడిన సోదరులిరువురూ లారీ ప్రమాదంలో మరణించారు. శ్రీనివాసాచారిగారి జ్ఞాపకం ఇప్పటికీ జీవించి వున్నది నాలో.

## శ్రోతల అజ్ఞానం

ఒక వూళ్ళో పేరందిన గాయకుడు సంగీత కచేరీ చేస్తున్నాడు. కర్ణాటక సంగీతజ్ఞుడు. అతడనేకరంగాల్లో కీర్తనలు పాడాడు. అయితే శ్రోతలు మెచ్చినట్లు కనిపించలేదు. 'సందేహంగా వుంటే చెప్పండి మీరు అడిగిన కీర్తన - కోరిన రాగం పాడుతాను' అన్నాడు గాయకుడు. ఒక శ్రోత "భాగేశ్వరీరాగం" పాడి వినిపించండి. ఇంతదాకా నేను పాడింది భాగేశ్వరీ రాగమే కదా! అన్నాడు. అంతదాకా మెచ్చని శ్రోతలు భేష్ భేష్ అంటూ కరతాళాలు వాయించారు. మా గురువుగారు కీర్తిశేషులు అబ్బాపీ గారికి కృతజ్ఞతలతో

దేశపతి గోపాలకృష్ణ